డిజిటల్ సహకార సేవలు

అన్నదాతలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడంలో ప్రాథమిక సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకం. అంతటి ప్రాధాన్యం కలిగిన సహకార సంఘాలను బలోపేతం చేసి సేవలు సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు అమలవుతున్న సేవలను కంప్యూటరీకరణ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా కార్యాచరణ ప్రారంభించింది. తద్వారా సహకార సంఘాల్లో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకోవడం వంటి పొరపాట్లకు ఇక చెక్ పడనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీఏసీఎస్‌లను బ్యాంకులుగా మార్చేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది.

– వరదయ్యపాళెం

- బలోపేతం దిశగా ప్రాథమిక సహకార సంఘాలు
- పీఏసీఎస్‌లలో రికార్డుల కంప్యూటరీకరణ
- గ్రామస్థాయిలో విస్తృత సేవలు
- పారదర్శకతకు పెద్దపీట

బ్యాంకుల తరహాలో రుణాల వివరాల కంప్యూటరీకరణ సహకార సంఘాల్లో జరుగుతోంది. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలోని 7 సహకార సంఘాల్లో 25,750 మంది రైతుల వివరాలు కంప్యూటరీకరణ కానున్నాయి.



కడూరు సహకార సంఘం కార్యాలయం

మూడంచెల విధానం

తొలుత ప్రాథమిక సహకార సంఘంలో డేటా అప్‌లోడ్ జరుగుతోంది. పీఏసీఎస్ సీఈఓ లాగిన్ అయ్యాక వివరాలను సూపర్‌వైజర్, సొసైటీ ఆడిటర్ లాగిన్‌లో క్రాస్ చెక్ చేస్తారు. ఆమోదం లభించాక ఫ్రీ మైగ్రేషన్ పేరిట 2024 ఏప్రిల్ 1 నుంచి జరుగుతున్న లావాదేవీల వివరాలు అప్‌లోడ్ అవుతాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ విధానంలో సేవలందిస్తారు. ఈ సేవలను వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అందించేందుకు లక్ష్యం పెట్టుకున్నారు.

ప్రయోజనాలు ఇలా..

పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేలా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. సొసైటీలు నమోదైన ప్రతి ఖాతాదారుడికి కంప్యూటరైజ్డ్ పాస్‌బుక్ వస్తుంది. డేటాలో తప్పులు జరిగే అవకాశం ఉండదు. తక్షణమే రిపోర్టులు అందుబాటులో ఉంటాయి.

- తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, వడ్డీ వివరాలను ఖాతాదారు సులువుగా తెలుసుకోవచ్చు.
- ప్రతి ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు నేరుగా రైతు ఖాతాలకు జమ కానున్నాయి.
- గ్రామ స్థాయిలో బ్యాంకింగ్ సేవలతో పాటు ఎరువుల పంపిణీ, పరికరాలు, రుణాలు అందించడం సులభతరమవుతుంది.




పిచ్చాటూరు మండలంలోని సహకార సంఘం, కడూరు సహకార కార్యాలయంలో కంప్యూటరీకరణ చేస్తున్న ఉద్యోగులు

మండలాల వారీగా సహకార సంఘాలు

సహకార సంఘం పేరు	సభ్యత్వం పొందిన రైతులు
వరదయ్యపాళెం	4700
బుచ్చినాయుడుకండ్రిగ	3683
సత్యవేడు	3397
నాగలాపురం	2877
కేవీబీపురం	5618
పిచ్చాటూరు	3740
నారాయణవనం	1735

సేవల్లో పారదర్శకత



రైతులకు అందించే సేవల్లో పారదర్శకత పెరుగుతుంది. ఎటువంటి సేవలైనా గ్రామస్థాయిలో పొందవచ్చు. సొసైటీలో పొరపాట్లు జరిగితే వాటిని సులువుగా అధిగమించవచ్చు. కేంద్ర సహకార శాఖ ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయించడంతో సంఘాలు బ్యాంకులుగా మారుతున్నాయి. సిబ్బంది సహకారంతో శత శాతం నమోదు పూర్తి చేస్తాం.

– సంపత్, సీఈఓ, కడూరు సహకార సంఘం

పింక్ బస్సులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలకు వెళుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ : స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పార్లపల్లి, పల్లమాలలో ఉచితంగా పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మమోగ్రామ్ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుందన్నారు. శుక్రవారం తలారివెట్టు, వెస్టువరత్తూరు, 23వ తేదీన ఆర్.అనంతపురం గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరగనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వైద్యాధికారి దివాకర్, వైద్యులు విద్యాసాగర్, పద్మావతి, చైతన్యభాను, సీహెచ్‌ఓ వెంకటేశులు, సర్పంచులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం పెట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం చిన్నయిగుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతల రోడ్డును బాగు చేయండి



వినతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కేటీ రోడ్డు నుంచి చిన్నయిగుంట గ్రామానికి వచ్చే రోడ్డు గుంతలమయంగా మారిందని మరమ్మతులు చేపట్టాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 4 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగలేని కారణంగా బస్సు తిప్పడం లేదన్నారు. అనంతరం పలు సమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్‌నాయుడు, వీఆర్‌ఓలు తిరుమలేష్, మధునాయుడు, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. గురువారం కార్యాలయంలో రెండో రోజు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వీఆర్‌ఓల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీల్లో వనరులను గుర్తించడంతో పాటు వాటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన పనులు, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి వనరులు, వినియోగం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. శాశ్వత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రెండు రోజుల శిక్షణపై సర్పంచులు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, ఎంఈఓ రవి, ఏఈ దేవిక, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాయదుర్గం ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పెట్టుకుంటే చర్యలు



పాఠశాలకు వెళ్లని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యాహక్కు చట్ట ప్రకారం పిల్లలు బడిలో ఉండాలని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. గురువారం ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా తంగెళ్లపురం, పెద్దపాలేడు గ్రామాల్లోని గిరిజన కాలనీల్లో సిబ్బందితో కలసి బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వం పిల్లల చదువు కోసం రూ.కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష

శ్రీకాళహస్తి : పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పీహెచ్‌సీ వైద్యులు, మెడికల్ సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు పని చేయాలని అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ భరోసా



వస్తు సామగ్రి పంపిణీ చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం కష్టంపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పూజారి గోపాల్‌రెడ్డి కర్మ క్రియలకు మంగళవారం హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సిపాయి భరోసా కిట్టు అందజేశారు. తొలుత గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులతో కూడిన సిపాయి భరోసా కిట్టు అందజేసి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు బాలాజీ ప్రసాద్ రెడ్డి, మాజీ వన్నెరెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, రత్నం రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంచల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, తానపరెడ్డి, గెరటారెడ్డి, ముని రామిరెడ్డి, అశోకయ్య, చంగయ్య, మురగారెడ్డి పాల్గొన్నారు.

గురుకుల సమస్యలకు పరిష్కారం

సత్యవేడు : బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. గురువారం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ బోర్డులను పరిశీలించారు.



గురుకుల పాఠశాలలో స్టేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వారానికి గుడ్లు, కోడికూర ఎన్ని రోజులు ఇస్తున్నారని ప్రిన్సిపల్ ప్రసూనాను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు వసతులను సద్వినియోగం చేసుకొని గురుకులానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గత పర్యాయం గురుకుల పాఠశాల తనిఖీకి వచ్చిన సమయంలో మరుగుదొడ్డి పైపులు పగిలి పోయి ఉండడం గుర్తించామని దానిని అపోలో టైర్స్ యాజమాన్యం మరమ్మతులు చేపట్టాలని కోరడంతో రూ. 7.5 లక్షలు వ్యయంతో నూతనంగా పైపులు అమర్చారని తెలిపారు. నీటి పైపులు ఆధునీకరించారని, స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు స్టేజ్ ఉన్నా వర్షం వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉందని స్టేజ్ పై కప్పు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ కోరారు. హీరో కంపెనీ యాజమాన్యంను స్టేజీపై కప్పు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలసి తిన్నారు. అంతకు ముందు పెద్ద ఈటిపాకంలో జరిగిన రెవెన్యూ గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. భూ సమస్యలు తహసీల్దారు సామరస్యంగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుకు 15 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, వీకేఎస్ బాషా, ఎంపీటీసీ శెల్వి, రమణయ్య, రూపేష్, కోళ్ల చిన్నా, బాలమురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సదస్సులో 10 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సురేష్ బాబు

శ్రీకాళహస్తి రూరల్: (రేణిగుంట): మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలు ఇస్తున్నాయని రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు అన్నారు. రేణిగుంట మండలంలోని గురవరాజు సచివాలయంలో గురువారం కొత్తపాలెం రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 10 వినతులు వచ్చాయని అందులో అయిదు సర్వే సమస్యలపై అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. సదస్సులో సర్పంచ్ దేవరపల్లి షైనాజ్ బీ, రహీం, డాక్టర్ జనార్దన్, మునికృష్ణ పాల్గొన్నారు.

టిప్పర్లు అధిక లోడ్ రవాణా చేస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ మురళి నాయుడు

సత్యవేడు : క్వారీల నుంచి కంకరు, డస్టు తరలిస్తున్న టిప్పర్లు అధిక లోడ్‌తో తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ మురళి హెచ్చరించారు. గురువారం సత్యవేడు వరదయ్యపాళెం టిప్పర్ల యజమానులతో సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఓవర్ టన్నేజ్ టిప్పర్లను అనుమతించేది లేదన్నారు. సత్యవేడు, ఇతర గ్రామాల్లో జన సంచారం ఉన్న ప్రాంతాల్లో వెళుతున్న టిప్పర్లు మితిమీరిన వేగంతో వెళ్లకూడదని తెలిపారు. రోడ్ల సమీపంలోని పాఠశాలల ప్రాంతాల్లో నెమ్మదిగా వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రామస్వామి, మల్లికార్జున్, టిప్పర్ల యజమానులు పీజీఎం మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా సంకట చతుర్ధశి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి వినాయకస్వామి ఆలయం వద్ద గురువారం ఆగమోక్తంగా సంకట చతుర్ధశి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా ఈ పూజలను ఆర్జితసేవగా తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.



హోమ పూజలు చేస్తున్న వేద పండితులు

వైభవంగా 'శ్రీవాణి' వార్షికోత్సవం

సత్యవేడు: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' ద్వితీయ వార్షికోత్సవం గురువారం శ్రీసిటీలో వైభవంగా నిర్వహించారు. స్థానిక బిజినెస్ సెంటర్‌లో ప్రముఖ సినీ విజ్ఞాన విశారద అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ చరిత్రకారుడు ఎస్వీ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'సినీ సాహిత్యంలో పౌరాణిక ప్రభావం' అనే కార్యక్రమం సంగీత, సాహిత్య ప్రియులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీవాణి ద్వారా ఏడాదిగా నిర్వహిస్తున్న వివిధ భక్తి, సంగీత, సాహిత్య ప్రదర్శనలు ద్వారా సమాజాన్ని సుసంపన్నం చేయడంలో శ్రీవాణి కృషి ఎనలేనిదన్నారు. అనంతరం ఎస్వీరామారావు సత్కరించారు. సముద్రాల రాఘవాచార్య, సముద్రాల జూనియర్, మల్లాది రామకృష్ణశాస్త్రి, పింగళి నాగేంద్రరావు, సదాశివంబ్రహ్మం, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆరుద్ర, సి. నారాయణరెడ్డి తదితర గీత రచయితల సృజనాత్మకతను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, మాజీ వైస్ చాన్స్‌లర్ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.



వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న ఎస్వీ రామారావు, డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

బాలబడి.. శిథిల ఒడి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని చిన్నయిగుంట గ్రామంలోని అంగన్‌వాడీ భవనం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరింది. దీంతో పిల్లలు, బాలింతలు, గర్భిణులు భయాందోళనకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు 12 మంది, బాలింతలు 3, పిల్లలు 17 మంది ఉన్నారు. ఈ భవనాన్ని నిర్మించి 30 ఏళ్లు గడుస్తోంది. ఇప్పటి వరకు భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్, గోడలు దెబ్బతిని కూలటానికి సిద్ధంగా ఉంది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం పడితే శ్లాబ్ ఉరుస్తుండటంతో బాలామృతం, వంట సామగ్రి, వంటి సరుకులు తడిసి ముద్దవుతున్నాయి. కార్యకర్త, సహాయకురాలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.




శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో 22 మంది ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేశారు. ఈఓలు మారిన ప్రతిసారి అంతర్గత బదిలీలు చేయడం ఆనవాయితీగా వస్తోందని అందులో భాగంగా బదిలీలు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. గతంలో హరితాభివృద్ధిలో పని చేసిన వారందరికీ ఆలయంలో అవకాశం కల్పించారు. గత ప్రభుత్వంలో విమర్శలు చేసిన నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత అదే పంథాను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము గెలిచిన తరువాత ఆలయంలో పనిచేస్తున్న హరితాభివృద్ధి వారినందరిని వెనక్కు పంపిస్తామన్న పాలకులు ఆ విషయాన్ని విస్మరించారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఇద్దరు ఉద్యోగులకు రూ.200, రూ.50 టిక్కెట్లు, రాహుకేతు అన్ని విభాగాల టిక్కెట్ల స్కానింగ్ సూపర్ వైజర్లుగా అవకాశం ఇచ్చారు. హరితాభివృద్ధిలో వాచ్‌వార్డులుగా ఉన్న నలుగురు ఉద్యోగులకు టిక్కెట్ల స్కానింగ్ డ్యూటీ వేశారు. డిప్యూటీ ఈఓ అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, లీగల్, ల్యాండ్స్, రాహుకేతు పూజ, ప్యాకింగ్, వస్తువులు, మింట్, టెంపుల్, సబ్ టెంపుల్స్ విధులు నుంచి అన్ని శాఖలపై పర్యవేక్షణ విధులు అప్పగించారు. ఏఈఓగా ఉన్న అసిస్టెంట్ కమిషనర్ కస్తూరికి శానిటేషన్ బాధ్యతలు కేటాయించారు. ఏఈఓలు లోకేష్‌బాబుకు ఆలయ పర్యవేక్షణ, అన్ని సేవా టిక్కెట్ల కౌంటర్లు, అభిషేకం, ఎంప్లాయిస్ అటెండెన్స్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. హేమమాలిని గతంలో ఉన్నవాటితో పాటు సబ్ టెంపుల్స్, అకౌంట్స్ బాధ్యతలు ఇచ్చారు. విద్యాసాగర్‌కు ప్రొటోకాల్, అదనంగా అకామిడేషన్ బాధ్యతలు ఇచ్చారు. సూపరింటెండెంట్ విజయసారథికి అన్నదానంతో పాటు స్కిట్, మింట్, నర్సింగ్ కళాశాల కేటాయించారు. మిగిలిన వారిని అదే స్థానాల్లో కొనసాగిస్తున్నారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళుతున్నామని ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సాగరం శ్రీధర్ అన్నారు. రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం చైర్మన్ ఎస్ హసన్ సాహెబ్ అధ్యక్షతన రైల్వే పెన్షనర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆలిండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సాగరం శ్రీధర్ పాల్గొని ప్రసంగించారు. నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని, కమ్యూటేషన్‌ను పది సంవత్సరాల ఎనిమిది నెలలకు ఆపివేసి ఎక్కువగా వసూలు చేసిన డబ్బును వాపస్ ఇవ్వాలని కోరారు. రైల్వే పెన్షనర్లకు ఒక పాస్ స్థానంలో రెండు పాసులు ఇవ్వాలన్నారు. రైల్వే పెన్షనర్లు అందరికీ డిజిటల్ పాస్ కాకుండా మామూలు పాసు ఇవ్వాలని, పెన్షనర్లను ఇన్‌కం టాక్స్ పరిధి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. రివైజ్డ్ పెన్షన్ పే ఆర్డర్లను ఇప్పించాలని, పెన్షనర్లకు ఉద్యోగస్తులతో సమానంగా హెచ్‌ఆర్‌ఏ, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జి జయంత్‌కుమార్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ పి రఘునాథ్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బి రాజేంద్రన్, పి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ ఆర్ ఎస్ జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సాగరం శ్రీధర్

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

శ్రీకాళహస్తి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద కేవీపీఎస్, దళిత సంఘాల నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని హిందుత్వ రాజ్యాంగంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో గంధం మణి, జనమాల గురవయ్య, కోటయ్య, కుమార్, షరీఫ్, వెంకటేష్, రాపూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : భారత రాజ్యాంగ నిర్మాత, దేశ ప్రజలకు దిశా నిర్దేశం చేసి- దేశ ఐక్యత చాటిన మార్గదర్శి బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా రాజ్యసభ వేదికగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం ముందు దళిత, గిరిజన, మహిళ, ప్రజా సంఘాలు కలసి నిరసన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసిరాజన్, వెంకటరమణ, కె. సెల్వరాజ్, హరినాథ్, ఐజయ్య, సత్యశ్రీ, దిలీప్ భాషా, కరీముల్లా పాల్గొన్నారు.



రేణిగుంట : అంబేడ్కర్ విగ్రహం ఎదుట సంఘాల నేతల నిరసన

వరదయ్యపాళెం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి పార్లమెంటులో చులకనగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేవీబీపురం మండలంలోని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి జనార్దన్ మాట్లాడుతూ.. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు శంకరయ్య, సురేష్, రత్నమ్మ పాల్గొన్నారు.

నాగలాపురం : పార్లమెంటులో జరిగిన చర్చల సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను చులకనగా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని గురువారం కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మురుగేశన్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీజేపీ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని దీన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. బీజేపీ దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మొదటి నుంచి అంబేడ్కర్‌ను ఆయన రచించిన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నారని ఆరోపించారు. తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి దినమని, దళితులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో సీపీఎం నేతలు, దళితులు